క్లుప్తంగా

మహిళలకు దీక్షా వస్త్రాల అందజేత



ఏలేశ్వరంలో మహిళలకు దీక్షా వస్త్రాలు అందజేస్తున్న ప్రచార కర్త కృష్ణబాబు

ఏలేశ్వరం: అన్నవరం సత్యనారాయణస్వామి వారి సత్య దీక్షలు చేపట్టే భక్తులకు ఆదివారం దీక్షా వస్త్రాలు పంపిణీ చేశారు. స్థానిక సత్యనారాయణస్వామి వారి ఆలయంలో సత్యదీక్ష ప్రచారకర్త నల్లిమిల్లి కృష్ణబాబు మహిళలకు దీక్షా వస్త్రాలు, మాలధారణ, స్వామివారి ఫొటో, పూజావిధానం పుస్తకం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 7 నుంచి సత్య దీక్షలు ప్రారంభమై వచ్చే నెల 4తో ముగుస్తాయన్నారు. పురుషులు 27 రోజులు, మహిళలు 18 రోజులు దీక్ష చేపట్టవచ్చన్నారు. భక్తులు దీక్ష చేపట్టి స్వామి వారి అనుగ్రహం పొందాలని కోరారు. కార్యక్రమంలో మీసాల రాజారత్నం, భక్తులు పాల్గొన్నారు.

ఏలేరులో 78.03 మీటర్ల నీటి నిల్వలు



ఏలేరులో ప్రస్తుత నీటి నిల్వలు

ఏలేశ్వరం: ఏలేరు జలాశయంలో ఆదివారం నాటికి 78.03 మీటర్ల నీటి నిల్వలు ఉన్నాయి. ఎగువ ప్రాంతం నుంచి 321 క్యూసెక్కుల నీరు జలాశయంలో చేరింది. ప్రస్తుతం ప్రాజెక్టులో 86.56 మీటర్లకు గాను 78.03 మీటర్లు, 24.11 టీఎంసీలకు గాను 11.26 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. దిగువ ఆయకట్టుకు 200, విశాఖకు 100, తిమ్మరాజు చెరువుకు 50, పంపాకు 50 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.

ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్



జి.కొత్తపల్లిలో వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేస్తున్న పంచాయతీ కార్మికులు

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని జి.కొత్తపల్లి సర్పంచ్ ఈగల విజయదుర్గ అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లిలో ఆదివారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. దోమల నివారణ మందు పిచికారీ చేశారు. వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లారు. ఈ సందర్భంగా సర్పంచ్ విజయదుర్గ మాట్లాడుతూ గ్రామ పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

ప్రమాదకరంగా రహదారి

రౌతులపూడి: ఉప ప్రణాళికా ప్రాంతమైన జల్దాం శివారు గిన్నిలారం ప్రధాన రహదారికి ఇరువైపులా తుప్పలు, చెట్ల పొదలు పెరిగిపోయి ప్రమాదకరంగా మారింది. దీంతో ఈ రోడ్డు మీదుగా వెళ్లేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గిరిజనులు దిగువ ప్రాంతంలో ఉండే చల్లూరు నుంచి సుమారు ఐదు కిలో మీటర్ల మేర అటవీ ప్రాంతం గుండా ప్రయాణం సాగిస్తున్నారు. కొండ మీద నివశిస్తున్న ప్రజలు వారు పండించిన పంటలను విక్రయించుకోవడానికి, వారికి కావలసిన నిత్యావసర సరుకులు కొనుగోలు చేయడానికి, అనారోగ్యం వస్తే ఆసుపత్రులకు వెళ్లటానికి ఈ రహదారి మీదుగానే వెళతారు. రహదారి తుప్పలు, పొదలుతో నిండిపోవడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారిని అభివృద్ధి చేయాలని గిరిజనులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

శంఖవరం: జాతీయ రహదారిపై మండలంలోని కత్తిపూడి వద్ద ఆదివారం జరిగిన ప్రమాదంలో వ్యక్తి మృతి చెందినట్టు అన్నవరం పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. తొండంగి మండలం ఏవీ నగరం గ్రామానికి చెందిన దామోజు లోవకుమార్ (38) ద్విచక్ర వాహనంపై అన్నవరం నుంచి కత్తిపూడి వస్తుండగా సీతంపేట రిఫరల్ ఆసుపత్రి సమీపంలో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో లోవకుమార్ అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతిడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృత దేహాన్ని తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఆర్డీఓ చర్చలు

జగ్గంపేట: రాజపూడిలో ఆమరణ దీక్ష చేస్తున్న జనసేన నేత పాటంశెట్టి సూర్యచంద్రను పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు ఆదివారం కలిసి చర్చలు జరిపారు. దీక్ష విరమించాలని విజ్ఞప్తి చేశారు. తాళ్లూరు లిఫ్ట్ పనిచేయకపోవడంతో పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని సూర్యచంద్ర రాజపూడిలో నాలుగు రోజులుగా ఆమరణ దీక్ష చేస్తున్నారు. దీంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు, పెద్దాపురం డీఎస్పీ లతా కుమారి రాజపూడిలో సూర్యచంద్రతో చర్చించి దీక్ష విరమించాలని కోరారు.

ఆహారం... ఆరోగ్యం

- పౌష్టికాహారంతోనే పరిపూర్ణ ఆరోగ్యం
- జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో అవగాహన కల్పిస్తున్న అధికారులు
- పోషకాహార ప్రదర్శనను ఆసక్తిగా తిలకిస్తున్న ప్రజలు
- మాతాశిశు సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు



వీరవరంలో గర్భిణికి పోషకాహార కిట్టు అందజేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

కిర్లంపూడి: ప్రజలకు పౌష్టికాహారంపై అవగాహన పెరుగుతోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు ప్రత్యేక సదస్సులు, కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈ శిబిరాలకు అనారోగ్యంతో వచ్చే వారికి డాక్టర్లు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తుండగా... మరోపక్క అదే ప్రాంగణంలో నిర్వహిస్తున్న పౌష్టికాహార స్టాల్స్ ఆకట్టుకుంటున్నాయి. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేసి గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార ప్రాధాన్యం వివరిస్తున్నారు. ప్రతి సురక్ష శిబిరంలోనూ పలు రకాల పండ్లు, కూరగాయలు, ఆకు కూరలు, పప్పు దినుసులు, చిరు ధాన్యాలు, వివిధ రకాల ఆహార పదార్థాలను ప్రదర్శించి వాటి ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తున్నారు. జగ్గంపేట నియోజకవర్గంలోని జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో ఏర్పాటు చేస్తున్న పౌష్టికాహార స్టాల్స్‌ను ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ప్రత్యేకంగా సందర్శించి గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేస్తున్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు

గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను ప్రదర్శిస్తున్నారు. వీటిలో రెండు కిలోల రాగి పండి, కిలో అటుకులు, పావు కిలో వంతున బెల్లం, ఖర్జూరం, వేరుశెనగ చక్కీలు ఉన్నాయి. వీటితో పాటు ఐసీడీఎస్ తరుపున అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అదనపు ఆహారంగా మూడు కిలోల పోషక విలువలు కలిగిన బియ్యం 3 కిలోలు, 1 లీటరు నూనే, 5 లీటర్ల పాలు, 25 కోడి గుడ్లు, పిల్లలకు ఆహారంగా బాలామృతం ప్యాకెట్‌ను సరఫరా చేస్తున్నారు.



ఐసీడీఎస్ స్టాల్‌లో పౌష్టికాహారం, చిరుధాన్యాల ప్రదర్శన



కిర్లంపూడి ఐసీడీఎస్ స్టాల్‌లో పౌష్టికాహారం ప్రదర్శిస్తున్న మహిళలు

పప్పు దినుసులు, కూరగాయలతో ఆహారం

తల్లీ, శిశువుకు మరిన్ని ప్రోటీన్ విలువలతో కూడిన పెసలు, ఉలవలు, వేరుశెనగ, బొబ్బర, కొమ్ము శెనగలు, మినుములు వంటి పప్పుదినుషులు అందిస్తున్నారు. వాటితో పాటు బియ్యానికి ప్రత్యామ్నాయమైన కొర్రలు, రాగులు, సజ్జలు, జొన్నలు, సామలు, ఎర్ర గోధుమ వంటి చిరు ధాన్యాలు, సి విటమిన్, ఆరోగ్యాన్ని అందించే జామ, ద్రాక్ష, బత్తాయి, బొప్పాయి, నిమ్మ, ద్రాక్ష, సీతాఫలం తదితర పండ్లు, పోషక విలువలు కలిగిన ఆనబ, మొక్కజొన్న, వంకాయ, టమాటా, క్యారెట్, బీట్‌రూట్, మునగ, కాకర వంటి కూరగాయాలను వినియోగించడం ద్వారా రక్తహీనతను నివారించవచ్చని చెబుతున్నారు. వ్యాధి నిరోధిక శక్తిని పెంచె తోటకూర, పాలకూర, బచ్చలి, గోంగూర, మునగ, పుదీనా, కొత్తి మీర తదితర ఆకుకూరలను ప్రదర్శించి అవగాహన కల్పిస్తున్నారు.

ఆహా.. ఏమి రుచి

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న పోషకాహార స్టాల్స్‌లో పులిహోర, బాలామృతంతో తయారు చేసే లడ్డూ, బిస్కెట్లు, గులాబీ పువ్వులు, కేకు, ఆవిరి కుడుములు, రాగి పిండితో తయారు చేసిన హల్వా, పకోడి, జంతికలు, అంబలి, రాగి సంకటి, ఉలవ ఉండలు, పాలతో తయారు చేసే జున్ను తదితర వంటకాలను అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసి ప్రదర్శిస్తున్నారు. ప్రదర్శనను తిలకించడానికి వచ్చే బాలింతలు, గర్భిణులకు వీటి ఆవస్యకతను వివరించి, వాటిని రుచి చూపించడంతో పాటు తయారీ విధానంపై అవగాహన కల్పిస్తున్నారు.

ఆరోగ్యానికి ఎంతో మేలు



వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం ఎంతో మేలు చేస్తోంది. సంపూర్ణ పోషణలో భాగంగా ప్రభుత్వం ఇచ్చే సరకులు సంపూర్ణ ఆరోగ్యానికి దోహదపడుతున్నాయి. బాలింతలు, గర్భిణులకు అవసరమైన పది రకాల పౌష్టికాహారం అందించాలనే ప్రభుత్వ నిర్ణయం అభినందనీయం. అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రతినెలా పౌష్టికాహారం కిట్లను అందిస్తున్నారు. మాతాశిశువు సంరక్షణకు ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయం.

– గండె వీరగణిలక్ష్మి, గర్భిణి, సోమరాయణంపేట

ప్రజలకు అవగాహన



ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య పరీక్షలు చేయిస్తున్నాం. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో స్టాల్స్ ఏర్పాటు చేసిన ప్రభుత్వం అందిస్తున్న పోషక విలువలతో కూడిన అహార పదార్థాలు, పప్పు దినుసులు, ఆకుకూరలు ప్రదర్శించి వాటిపై అవగాహన కల్పిస్తున్నాం. గర్భిణిగా నమోదైన నాటి నుంచి ఆరో నెల బాలింత వరకూ ఇంటి వద్దకే సరుకులు అందజేస్తున్నాం. ఇది మాతాశిశు సంరక్షణకు ఎంతో మేలు చేస్తోంది.

– ఎం. పూర్ణిమ, సీడీపీఓ, ఐసీడీఎస్ జగ్గంపేట

ఆసుపత్రికి వెళ్లి పింఛను అందజేత



కాకినాడ జీజీహెచ్‌లో వరలక్ష్మికి పింఛను అందజేస్తున్న వలంటీర్ అమ్మాణి

కిర్లంపూడి: మండలంలోని జగపతినగరం గ్రామానికి చెందిన రాపేటి వరలక్ష్మి అనారోగ్యంతో కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె వితంతు పింఛనుదారు కావడంతో గ్రామ వలంటీర్ అమ్మాణి సొంత ఖర్చులతో కిర్లంపూడి నుంచి కాకినాడ జీజీహెచ్‌కు వెళ్లి వరలక్ష్మికి పింఛను సొమ్మును అందజేసింది. వలంటీర్ అమ్మాణిని పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు అభినందించారు.

కాకినాడ జీజీహెచ్‌కు వెళ్లి..



కాకినాడ జీజీహెచ్‌లో బాబ్జీకి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సురేంద్ర

గండేపల్లి: గ్రామానికి చెందిన పింఛనుదారు గోరీపట్లపు బాబ్జీ అనారోగ్యంతో కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడికి గ్రామ వాలంటీర్ సురేంద్ర ఆదివారం కాకినాడ జీజీహెచ్‌కు వెళ్లి పింఛన్ సొమ్ము అందజేశాడు. వలంటీర్ సురేంద్రను పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు.

పార్టీ విజయమే లక్ష్యంగా పని చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్
- లచ్చిరెడ్డిపాలెంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం

రౌతులపూడి: వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ సూచించారు. మండలంలోని లచ్చిరెడ్డిపాలెంలో ఆదివారం వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జిగిరెడ్డి శ్రీను అధ్యక్షతన ఏపీకి జగనే ఎందుకు కావాలంటే.. (వై ఏపీ నీడ్స్ జగన్) కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే పర్వత ముఖ్య అతిథిగా పాల్గొని పార్టీ నాయకులు, కార్యకర్తలు, గృహ సారథులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత నాలుగున్నరేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ప్రభుత్వంపై టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేస్తున్న తప్పుడు ఆరోపణలను ప్రజలకు తెలియజేయాలన్నారు. గృహసారథులు, కన్వీనర్లు ప్రజల్లోకి వెళ్లి గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వానికి మధ్య తేడాను ప్రజలకు వివరించాలని సూచించారు. వచ్చే నెల 9 నుంచి గ్రామాల వారీగా నాయకులు ప్రచార కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వచ్చే మూడు నెలల్లో ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, ప్రత్తిపాడు మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ జిగిరెడ్డి రమణమ్మ, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సాయి, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కరబాబు, డీసీసీబీ డైరెక్టర్ పులి మధు, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సీహెచ్‌వీవీ సత్యనారాయణ, పార్టీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- వాడీవేడిగా జగ్గంపేట మండల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

జగ్గంపేట: మండల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఎంపీపీ అత్తులూరి నాగబాబు అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం జరిగింది. ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ముఖ్య అతిథిగా హాజరై వివిధ శాఖల పనితీరుపై సమీక్షించారు.

సమస్యల పరిష్కారంలో జాప్యం

గ్రామాల్లో విద్యుత్ సమస్యల పరిష్కారంలో తీవ్ర జాప్యం జరుగుతోందని, ప్రతి మండల సమావేశంలో అధికారుల దృష్టికి సమస్యలు తీసుకువచ్చినా పరిష్కరించడం లేదని పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు ఎమ్మెల్యే చంటిబాబుకు వివరించారు. విద్యుత్ వైర్లు కిందకు వేలాడడం, స్తంభాలు మార్చడం, లో వోల్టేజీ సమస్య, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ట్రాన్స్ కో ఏఈ శ్రీనివాస్, విద్యుత్ కాంట్రాక్టర్ గుర్రం శ్రీనుతో ఎమ్మెల్యే మాట్లాడారు. సాంకేతిక సమస్యలు, మీ పరిధిలో లేని వాటిని ఉన్నతాధికారులతో మాట్లాడతానని చెప్పారు.మిగిలిన సమస్యలను ఎన్ని రోజుల్లో పరిష్కరిస్తారని ప్రశ్నించారు. కాంట్రాక్టర్ శ్రీను 15 రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ నెలాఖరు వరకూ సమయం ఇస్తున్నాని, అప్పటికీ పూర్తి కాని పక్షంలో చర్యలు తప్పవని ఎమ్మెల్యే హెచ్చరించారు. అనంతరం పంచాయతీ రాజ్, వెలుగు, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్ అండ్ బీ తదితర శాఖల పనితీరుపై సమీక్షించారు. సమావేశంలో మండల పరిషత్ బడ్జెట్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఒమ్మి బింధుమాధవి, వైఎస్సార్ సీపీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం, మండల సచివాలయాల కన్వీనర్ బండారు రాజా, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ఉయ్యూరి నాని, ఎంపీడీఓ వసంత కుమార్, వైఎస్సార్ సీపీ మండల నేత ఎం.రామన్నదొర, వైస్ ఎంపీపీ నక్కా శ్రీను, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఓటు నమోదులో నిబంధనలు పాటించాలి



ప్రత్తిపాడులో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ



కోటనందూరులో ఓటరు జాబితాను పరిశీలిస్తున్న తహసీల్దార్ కుశరాజు

కోటనందూరు: ఓటు నమోదు, తొలగింపులో విధిగా నిబంధనలు పాటించాలని తహసీల్దార్ కె. కుశరాజు బీఎల్వోలకు సూచించారు. మండలంలోని ఎస్సార్‌పేట, బిళ్లనందూరు, ఇండుగపల్లి, టీజేనగరం, బొద్దవరం, కోటనందూరు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటు నమోదు శిబిరాలను ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఓటు నమోదు, తొలగింపులో ఎవరి ప్రమేయం ఉండకూడదన్నారు. మండలంలోని 41 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఫారం-6కు 212, ఫారం-7కు 188, ఫారం-8కు 147 దరఖాస్తులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ డి.శివకుమార్, వీఆర్వోలు పాల్గొన్నారు.

ప్రత్యేక శిబిరాలకు 1078 దరఖాస్తులు

ప్రత్తిపాడు: నియోజకవర్గంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాల్లో 1078 దరఖాస్తులు అందాయని అసిస్టెంట్ ఎన్నికల అధికారి, ప్రత్తిపాడు తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ తెలిపారు. ప్రత్తిపాడు మండలంలోని పలు గ్రామాల్లో రెండో రోజు ఆదివారం నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని 227 పోలింగ్ కేంద్రాల్లో ఫారం-6 ద్వారా 703 దరఖాస్తులు, ఫారం-7 ద్వారా 122, ఫారం-8 ద్వారా 253 దరఖాస్తులు అందాయని తహసీల్దార్ వివరించారు.

ఓటరు నమోదు శిబిరాల్లో 406 దరఖాస్తులు

తొండంగి: మండల వ్యాప్తంగా రెండు రోజల పాటు నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాల్లో 406 దరఖాస్తులు అందాయని తహసీల్దార్ జి.సుబ్రహ్మణ్యం ఆదివారం తెలిపారు. రావికంపాడు, సీతారాంపురం, కొమ్మనాపల్లి తదితర గ్రామాల్లో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను ఆయన తనిఖీ చేశారు. తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించాలని సిబ్బందికి సూచించారు.

మహిళా సంఘాలకు రూ.2 కోట్ల రుణం



మహిళలకు నమూనా చెక్కు అందజేస్తున్న జీఎం ప్రవీణ్ కుమార్

తుని రూరల్: స్వయం సహాయక సంఘాలకు అందించే రుణాలతో ఆర్థికాభివృద్ధి సాధించాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జీఎం ప్రవీణ్ కుమార్ సూచించారు. మండలం దొండవాకలో ఆదివారం రాత్రి భారత ప్రభుత్వ బీమా పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ఎస్‌హెచ్‌జీ సంఘాలకు మంజూరైన రూ.2 కోట్ల రుణాల నమూనా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు వడ్డీ రాయితీలు అందిస్తున్నాయన్నారు. మహిళలకు ఆర్థికంగా బలోపేతమైతే ఆయా కుటుంబాలు అభివృద్ధి సాధిస్తాయన్నారు. ప్రతిఒక్కరూ బీమా సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆర్థిక ప్రగతి, ఆర్థిక అసమానతలపై కళాకారులతో బుర్రకథ ప్రదర్శించారు. ఆర్ఎం సురేష్ బాబు, సీఎం సత్యకిషోర్, మేనేజర్ శ్రీనివాస్, ఫీల్డ్ ఆఫీసర్ వెంకట గణేష్, సర్పంచ్ లంక లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు లంక పార్వతి పాల్గొన్నారు.

శ్రమైక జీవనం చిత్రానికి అవార్డు



చక్రపాణిని సన్మానిస్తున్న నిర్వాహకులు



చక్రపాణి గీసిన శ్రమైక జీవనం చిత్రం

ఏలేశ్వరం: చిత్ర కళా నిలయం ఆధ్వర్యంలో చోడవరంలో ఆదివారం నిర్వహించిన 6వ ఆర్ట్ కాంపిటీషన్‌లో పట్టణానికి చెందిన తూము రౌతు చక్రపాణి గీసిన చిత్రానికి అవార్డు వచ్చింది. చక్రపాణి గీసిన శ్రమైక జీవనం చిత్రం టాప్ టెన్‌లో నిలిచి అవార్డు పొందింది. చిత్ర కళానిలయం వ్యవస్థాపకుడు బొడ్డేటి సూర్యనారాయణ ఆధ్వర్యంలో చక్రపాణిని సన్మానించి అవార్డు, నగదు పురస్కారం అందజేశారు. అవార్డు పొందిన చక్రపాణికి పలువురు అభినందనలు తెలిపారు.

కార్మిక సమస్యల పరిష్కారమే లక్ష్యం



కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ ప్రతినిధులు

తుని: కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా రక్షణ భేరీ బస్సుయాత్ర కొనసాగుతుందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏవీ నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం తుని చేరుకున్న ప్రజా రక్షణ భేరీ బస్సుయాత్రకు గొల్లప్పారావు సెంటర్లో పట్టణ సీఐటీయూ ప్రతినిధులు స్వాగతం పలికారు. నియోజకవర్గంలోని పేదలు, కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ అసమానతలు లేని అభివృద్ధి సీపీఎం విధానమన్నారు. అధికారంలో ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నాయన్నారు. దేశ, రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రజలంతా కలిసి పోరాటం చేయాలన్నారు. కార్మిక సమస్యలపై ప్రభుత్వాలు దిగొచ్చేలా ఈ నెల 15న విజయవాడలో జరిగే బహిరంగ సభకు కార్మికులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ ప్రతినిధులు మంతెన సీతారాం, రాజశేఖర్, బేబీరాణి, నక్కెళ్ల శ్రీనివాస్, సత్యకళ, గౌతమ్, మంగరాజు, రమణ, చంద్రరావు, కామేశ్వరి పాల్గొన్నారు.

స్ఫూర్తి ఫౌండేషన్ సేవలు అభినందనీయం



తొండంగి: గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు స్ఫూర్తి ఫౌండేషన్ అందిస్తున్న సేవలు అభినందనీయమని జిల్లా ఎస్పీ పి.సతీష్‌కుమార్ అన్నారు. స్ఫూర్తి ఫౌండేషన్ నిర్వాహకుడు నేమాల శ్రీనివాసరావు కాకినాడలో ఆదివారం ఆయన సత్కరించారు. కాకినాడలో శ్రావణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో తొండంగి మండలం వేమవరం గ్రామానికి చెందిన స్ఫూర్తి ఫౌండేషన్ నిర్వాహకుడు నేమాల శ్రీనివాసరావు సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

స్ఫూర్తి ఫౌండేషన్ నిర్వాహకుడు శ్రీనివాసరావుకు జ్ఞాపిక అందజేస్తున్న ఎస్పీ సతీష్ కుమార్

అకాల వర్షంతో పత్తి రైతు విలవిల



చామవరంలో సాగు చేసిన పత్తి పంట

తుని రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో అకాల వర్షాలు పడడంతో పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు. నియోజకవర్గంలో గురు, శుక్రవారాల్లో వర్షం పడింది. శనివారం వాతావరణం మేఘావృతమై ఉండడంతో పత్తి రైతుల్లో వణికిపోతున్నారు. ఈ సంవత్సరం వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో రైతులు పత్తి సాగును తగ్గించేశారు. తుని వ్యవసాయ సబ్ డివిజన్‌లోని తుని, కోటనందూరు, తొండంగి, రౌతులపూడి, శంఖవరం మండలాల్లో కేవలం 1625 ఎకరాల్లో పత్తి వేశారు. కాగా వర్షాభావ పరిస్థితులు, తెగుళ్ల బెడదతో పంట దిగుబడి తగ్గిపోయింది. దానికి తోడు ప్రస్తుతం అకాల వర్షాలతో మరింత నష్టాలకు గురవుతామని రైతులు వాపోతున్నారు. పత్తి సేకరణ చేద్దామంటే ఇప్పటికే రెండు రోజులు పొలంలో చెట్లపై పత్తి తడిసిపోయిందని, ఇప్పుడు మరోసారి తడిసిపోయే అవకాశం ఉందన్నారు. తడిసిన పత్తికి గిట్టుబాటు ధర లభించదన్నారు. తడిసిన పత్తికి గిట్టుబాటు ధర ప్రకటించాలని పలువురు రైతులు కోరుతున్నారు.